క్లుప్తంగా

సన్మానం



సాల్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్‌టౌన్: జహీరాబాద్ బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన సాల్మన్‌ను శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించి శాలువా పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పాండు రంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిథున్‌రాజ్, ఇజ్రాయిల్, ముర్తుజా, బండి మోహన్, సత్యం, ప్రభు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న రాజు

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ పులిమామిడి రాజు అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో సప్త అఖండ నామస్మరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏడురోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, గ్రామ పెద్దలు సంగన్న, పోచన్న, మల్లారెడ్డి, వెంకటేశం, ప్రసాద్, మల్లేశం, యాదగిరి, సత్యం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చాల్కి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పరీక్షా ప్యాడ్‌లు ఇతర స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదుకోవాలన్నారు. పదిలో పదికి పది జీపీఏ సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీన, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జహీరాబాద్: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని దిడిగి గ్రామానికి చెందిన కుల్‌కర్ణి ఆదర్శ్‌కు రూ.60వేల విలువ గల చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు.

నేడు జహీరాబాద్ మండల సమావేశం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుమతి తెలిపారు. ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

జోగిపేటలో స్వచ్ఛ మార్చ్

జోగిపేట(అందోల్): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం స్వచ్ఛ మార్చ్‌ను సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ నిర్వహించారు. అందోల్ జోగిపేట మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకూ స్వచ్ఛ మార్షల్ మార్చ్ నిర్వహించారు. అనంతరం వారితో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వయం శుభ్రతను పాటించాలన్నదే స్వచ్ఛ మార్షల్ మార్చ్ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో, మెప్మా కో ఆర్డినేటర్ బిక్షపతి, స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్ లక్ష్మినారాయణ, మెప్మా రిసోర్స్ పర్సన్స్ మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోషక ఆహారం పెట్టాలి

మునిపల్లి(అందోల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషక ఆహారం పెట్టాలని ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ సమావేశ మందిరంలో పోషణ, అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, ఎంపీడీఓ అంజలీదేవి పాల్గొన్నారు.

మజ్దూర్-కిసాన్ ర్యాలీని జయప్రదం చేయాలి



మారేపల్లిలో కరపత్రం విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 5వ తేదీన ఢిల్లీలో నిర్వహించే మజ్దూర్ – కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని మారేపల్లి, గంగారం, గారకుర్తిలలో మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీకి సంబంధించిన కరపత్రం పంచుతూ, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ కార్మికులను, రైతులను దోపిడీ చేస్తూ ఆదానీ, అంబానీకి «అమృతకాల్» భరోసా కల్పించేందుకు మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. నిత్యావసరాల ధరలు, బియ్యం, గోధుమలు, పప్పులు, పాలు, పెరుగు, కూరగాయలు పెరుగుతున్నాయన్నారు. నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉందని, కనీస వేతనాలు, 8 గంటల పని దినం, చట్టబద్ధంగా ఉపాధి హామీనిచ్చే ప్రాజెక్టులను నీరుగారుస్తోందన్నారు. సమస్యలను ప్రజకు వివరించేందుకు పాదయాత్రల ద్వారా ఇంటింటికి ప్రచారం కొనసాగుతుందన్నారు. మూడు సంఘాల ఆధ్వర్యంలో జాతాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజాసమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం మీద ప్రజలు తిరుగుబాటు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ప్రజలను చైతన్యం చేసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మండల కన్వీనర్ బాబురావు, రాజయ్య, వెంకయ్య, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అశోక్, భ్రమరాంబ, సుశీల, వాణి, శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి తెలిపారు. నిజాంపేట్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల సమ్మేళనంలో మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటుపడలేదని అన్నారు. సీఎంగా కేసీఆర్ అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం రైతు బీమా ప్రవేశపెట్టాడని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల దగ్గరకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, నర్సింహారెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మండల ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి, బాజేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, దుర్గారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు కాజేశారు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూర్(నారాయణఖేడ్): గత పాలకులు గుత్తేదార్లుగా అవతారం ఎత్తి రోడ్ల పనులు చేయకుండానే బిల్లులు కాజేశారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం నాగల్‌గిద్ద మండలం మోర్గిలో బీదర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నుంచి మోర్గి మీదుగా బీదర్ వరకు రోజు నాలుగు ట్రిప్పులు బస్సు తిరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ పాండు, వైస్ ఎంపీపీ పండరి యాదవ్, రైతు బంధు అధ్యక్షుడు నందు పాటీల్, నాయకులు ప్రహ్లాద్, పండరి పాల్గొన్నారు.

అల్గోల్‌లో శ్రమదానం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆచార్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో మండలంలోని అల్గోల్‌లో గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. గ్రామంలోని మురికి కాల్వలను పరిశుభ్రం చేసి, రోడ్లపై పేరుకున్న చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. పాఠశాల పరిసరాల్లో కూడా పారిశుధ్య పనులను నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్, ప్రోగ్రాం అధికారి రామచంద్రం, అధ్యాపకులు దత్తు, నందుగౌడ్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఝరాసంగం(జహీరాబాద్): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని అధికారులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కుప్పనగర్ గ్రామంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చిరుధాన్యాలు, పోషకాలు కలిగిన ఆహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం హాజీ బేగం, సీఆర్పీ షఫీయోద్దీన్, ఉపాధ్యాయుడు ఎలమంద, అంగన్‌వాడీ టీచర్ కవిత, శకుంతల, ఆశకార్యకర్తలు సునీత, పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు

ఎన్ఎస్ఎస్ శిబిరం



చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో కొనసాగుతోంది. శుక్రవారం ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. అదేవిధంగా ఉదయం సమయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సేవ కార్యక్రమాలు అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అమర్‌నాథ్ సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామాజిక సేవ అభినందనీయం

ఇంద్రేశం సర్పంచ్ నర్సింలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, సర్పంచ్, కార్యదర్శి

పటాన్‌చెరు టౌన్: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని ఇంద్రేశం సర్పంచ్ దండు నర్సింలు అన్నారు. ఇంద్రేశంలో ఏడు రోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ మానెమ్మ, గ్రామ కార్యదర్శి సుభాష్‌లు వాలంటీర్లను అభినందించారు. వారి సేవను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ...వారం రోజులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంద్రేశం గ్రామంలో పర్యటించి కేంద్ర యువజన శాఖ రూపొందించిన నమూనా ఆధారంగా సర్వే నిర్వహించారని చెప్పారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం, గృహ సంబంధ సమస్యలపై సర్వేను చేశారన్నారు. గ్రామంలో పేదలకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిత్యావసర సరుకులను అందజేశారు. హెల్త్ క్యాంపు నిర్వహించి పరీక్షలు చేయించారు. పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీహరి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

మంత్రి హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నేతల వినతి



మంత్రి హరీశ్‌రావుతో బీఆర్ఎస్ నేతలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: కొత్తగా ఏర్పడిన మండల కేంద్రం చౌటకూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు శుక్రవారం మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలసి వినతిపత్రం అందించారు. మండలం ఆవిర్భవించి మూడేళ్లు గడిచినా కార్యాలయాలు ఏర్పాటు కాలేదని మంత్రి దష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే మండల కేంద్రంలో ఎంపీడీఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐకేపీ, ఉపాధి హామీ, పశుసంవర్ధక శాఖ తదితర సంబంధించిన కార్యాలయాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేకపోవడంతో చౌటకూర్ మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మండల అధ్యక్షుడు చౌకపల్లి శివకుమార్, మండల ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కిష్టారెడ్డి, భానూరి లక్ష్మణ్, రామ్నాని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాండు



మాట్లాడుతున్న పాండు

పటాన్‌చెరు టౌన్: కార్పొరేటర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాండు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ నాయకుడిగా కార్పొరేటర్ స్థాయిలో పూజలు చేయడం మింగుడుపడక దౌర్జన్యానికి పాల్పడారని ఆరోపించారు. కార్పొరేటర్‌పై దాడికి నిరసనగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్పొరేటర్‌పై దాడి చేస్తే, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని వారు సమావేశంలో ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోజుకోటి, ప్రభాకర్ యాదవ్, ఐలేశ్, కుర్మసంఘం, బీసీ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ దురుసుగా మాట్లాడారు

శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయ చైర్మన్ మనోహర్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: కార్పొరేటర్ మెట్టుకుమార్ చొక్కా పట్టుకొని దురుసుగా వ్యవహరించిన తీరు బాధాకరంగా ఉందని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయ చైర్మన్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ చైర్మన్ మాట్లాడారు... ఆలయ నిర్వహణ, ఇతర అవసరాలకు ఇప్పటివరకూ సొంతనిధులు రూ.కోటి వరకూ ఖర్చు చేసినట్టు చెప్పారు. ఆలయ పవిత్రతను కాపాడటమే కాకుండా, నిరంతరం ఆలయబాగోగులు చూస్తున్న తనను కార్పొరేటర్ చొక్కా పట్టుకుని దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. శ్రీ కోదండ సీతారామ స్వామి కల్యాణం సందర్భంగా చిలుకూరి బాలజీ ఆలయ గాయకులు సంకీర్తన చేస్తుండగా మైకు లాక్కుని వారిని కార్పొరేటర్ గెంటేశారన్నారు. ఈ విషయంలో నేను క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు. గురువారం ఆలయం వద్ద జరిగిన ఘటనతో మనోవేదనకు గురవుతుంటే రాత్రి ఇంటిపై రాళ్ల దాడి చేశారన్నారు. కార్పొరేటర్ గెలుపులో సహకరించినట్టు ఆలయ చైర్మన్ పేర్కొన్నారు.

చిరుధాన్యాలతో వ్యాధి నిరోధకశక్తి పెంపు



న్యాల్‌కల్‌లో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీతబాయి

న్యాల్‌కల్(జహీరాబాద్): చిరుధాన్యాల్లో అనేక పోషక విలువలు ఉన్నాయని, వాటిని వినియోగించడంతో మనిషిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జహీరాబాద్ సీడీపీఓ సునితబాయి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం న్యాల్‌కల్‌లోని ఐకేపీ కార్యాలయంలో బాలింతలు, మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకప్పుడు చిరు ధాన్యాలంటే ఎంతో ఇష్టపడేవారని, ప్రస్తుతం వాడకం గణనీయంగా తగ్గిందన్నారు. అదే విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తినే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కుమార్‌తో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ ముఖ్యనేతలకు సన్మానం



బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకులను సన్మానించిన గడీల శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లాలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన జాతీయ, రాష్ట్ర ముఖ్య నాయకులను ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ ఇస్నాపూర్‌లో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, వీరేందర్ గౌడ్‌లను ఇస్నాపూర్‌లోని శ్రీకాంత్ కార్యాలయంలో ఘనంగా శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ర్యాలీగా జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి వెళ్లారు.

సంగారెడ్డి తరలిన బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: సంగారెడ్డిలో శుక్రవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభించే బీజేపీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి పాల్గొనేందుకు ఖేడ్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పలు వాహనాల్లో ఖేడ్‌కు వచ్చారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్ దుర్గాభవానీమాత ఆలయం వద్ద పార్టీ ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్ జెండా ఊపగా, ఇక్కడి నుంచి సంగారెడ్డికి బయలుదేరి వెళ్లారు.

చీకోటి ప్రవీణ్‌పై మజ్లిస్ నేతల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మజ్లిస్ నాయకులు

జహీరాబాద్: శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న చీకోటి ప్రవీణ్ ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శుక్రవారం మజ్లిస్ పార్టీ నేతలు జహీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి జహీరాబాద్‌లో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో మజ్లిస్ పార్టీ నేతలైన ఓవైసీ బ్రదర్స్‌పై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న జహీరాబాద్ వాతావరణాన్ని చీకోటి ప్రవీణ్ చెడగొట్టే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేసు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మజ్లిస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అతార్ అహ్మద్, నాయకులు మొహియొద్దీన్‌గౌరి, ఆమెర్, అబ్దుల్లా, షోయబ్, ఇలియాజ్, షఫి, సమీర్, ఫయాజ్, రఫీక్ ఉన్నారు.

కొనసాగుతున్న శ్రీసీతారామ బ్రహ్మోత్సవాలు



కీర్తనలో భక్తులు

నారాయణఖేడ్: ఖేడ్ శ్రీరామమందిరంలో సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, అఖండ హరినామ సప్తహా కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా సామూహిక అభిషేకాలు, గజవాహన సేవ, కీర్తన, ప్రసాద వితరణ, సప్తహంలో భాగంగా భజన, కీర్తన, హరిజాగరణ, కాకడ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయకమిటీ బాధ్యులు హన్మాండ్లు సేట్, వివేకాంద్, పాండు తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ పట్టణంలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో శుక్రవారం లలితాంబికాదేవి నవరాత్రి మహోత్సవాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, ముఖ్యనాయకులు నగేష్, పండరియాదవ్, జైపాల్‌రెడ్డి, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సమావేశాలు ప్రారంభం



మాట్లాడుతున్న తారా కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2ల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల్లో అంటువ్యాధులు, సామాజిక రుగ్మతలు, పర్యావరణ అంశాలపై ర్యాలీల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు హరితహారం, శ్రమదాన కార్యక్రమాలతో పాటు ఎంఎన్ఆర్ కళాశాల సహకారంతో ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తామన్నారు. వారంరోజుల పాటు వలంటీర్లకు ప్రత్యేక యోగా, మానసిక శిక్షణ తరగతులు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, ఎన్ఎస్ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు సిర్గాపూర్ మండల సమావేశం**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 1న శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ సుజాత శుక్రవారం తెలిపారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

◆ **మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి**

సంగారెడ్డిటౌన్: మైనింగ్ కంపెనీల పేరుతో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ శుక్రవారం కంది మండలం ఎర్దనూర్ రైతులు సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డిని కోరారు. దీంతో ఆయన సంగారెడ్డి ఆర్డీఓతో మాట్లాడారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

◆ **కంటి వెలుగు శిబిరం ప్రారంభం**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బోక్కస్‌గాంలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

◆ **పరీక్ష సామగ్రి పంపిణీ**

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్ గ్రామానికి చెందిన ఇందూరి కృష్ణ విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. గ్రామంలోని వీరభద్రేశ్వర ఆలయంలో కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో 35 మంది విద్యార్థినులకు ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌టీ సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

◆ **బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనంద్ స్వరూప్ షెట్కార్**

నారాయణఖేడ్: ఖేడ్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన బి.సంగమేశ్వర్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఉపాధ్యక్షుడిగా పి.లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఇ.మారుతిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డి.చంద్రశేఖర్, కోశాధికారిగా పి.నర్సింహారావు, మహిళా ప్రతినిధురాలిగా ప్రమీలపాటిల్ ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి వివరించారు.

◆ **చలివేంద్రం ప్రారంభం**

నారాయణఖేడ్: ఖేడ్‌లోని హైదరాబాద్ రోడ్డు పక్కన షెట్కార్ పెట్రోల్‌బంకు ఎదుట సురేష్ షెట్కార్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ప్రారంభించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్, నెహ్రూనాయక్, సాయిలు, చందర్ నాయక్, కొండల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సంతోష్ పటేల్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా పల్లకీసేవ**

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలో శ్రీరామ పల్లకీసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి రామాలయం నుంచి ప్రారంభమైన పల్లకీ సేవ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పల్లకీసేవలో పాల్గొన్నారు. మహిళలు కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో శ్రీరామ పట్టభిషేకం కార్యక్రమం జరిపారు. ఉత్సవాల్లో పట్టణ ప్రముఖులు, పురోహితులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.

◆ **చలో ఢిల్లీ జయప్రదం చేయాలి**

జిన్నారం(పటాన్‌చెరు): ఏప్రిల్ 5న సీఐటీయూ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి.భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిన్నారం మండలం ఖాజీపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నరేష్ పాల్గొన్నారు.

◆ **పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

జిన్నారం(పటాన్‌చెరు): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన జిన్నారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, సీడీపీఓ చంద్రకళ, మండల సూపర్‌వైజర్ మీరాబాయి, సర్పంచ్ లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.